# కమలా నెహ్రూ సమాధివద్ద ... జవ్హార్‌లాల్

జవ్హార్‌లాల్ పేరు తలుచుకన్నప్పుడల్లా నిద్ర వొస్తోంది. ఆయనపైని వ్యాసం రాస్తానని ఎందుకు వొప్పుకున్నాను అని నిరాశతో ఆలోచిస్తున్నాను. ఆరాత్రి, నా గదిలో చాప మీద వొంటరిగా కూచుని, నిద్రపోకూడదు, రేపు వ్యాసం పంపి తీరాలి అని దీక్షతో కళ్లను మూతపడకుండా బలవంతంగా తెరిచివుంచాను. ఆలోచనలు ఆగిపోయినాయి. నా మనోకాశంలో మంత్రం మల్లే జవ్హార్‌లాల్, జవ్హార్‌లాల్ అని శబ్దం మోగుతోంది. ఆ పేరుని నా మనసులోంచి, ఏవో శ్రావ్యమైన కంఠాలు అందుకున్నాయి. గంధర్వగీతానికి పల్లవివలె, నా కళ్ళముందు నా గది గోడలు తలుపు మల్లే తెరుచుకున్నాయి. పై కప్పు గాలిలో ఎగిరిపోయింది. నక్షత్రాలతో, అస్తమించే చంద్రరేఖతో సహా ఆకాశం చాలా దగ్గిరై, నా కళ్ళముందునించి నా వీపు వెనుక దూరమైపోయింది. వెడుతున్నాను వేగంగా వెతుక్కుంటో.

మెత్తని వెలుగు, ఉద్యానవనాలు, పురాతన వృక్షాలు, పూరిళ్ళు, వివిధ పక్షి రుతాలు, కోనేర్లు, బంగారపు తామరపూలు, స్ఫటిక సోపానాలు, పెరిగే పువ్వుల గుత్తులు, సెలయేళ్ళు, కొండల మీదనుంచి దొరువులలోకి దొర్లుతూ, ఎక్కడ చూసినా వృక్షాలతో, ఛాయలతో, పచ్చిగడ్డిమీద, నీటివొడ్డున, కిన్నెరలు, గంధర్వులు, ప్రియులు, అనేక వన్నెల రంగుల, మెరుపుల చీరెలు ధరించి, కోనేర్లలో పడవల్లోంచి తామరపూలలోకి, పూలనుంచి మేఘాలలోకి, ఒకరి ఆలింగనంలోంచి ఇంకొకరి ఆలింగనంలోకి, దూకుతో, ఆడుతో పాడుతో, నృత్యం చేస్తో నిర్లక్ష్యం, ఏ యోచనా లేని ఆనందం, నిన్నా రేపూ లేని వర్తమానంలో తేలుతో, గొప్ప శృంగారంలో, తృప్తిలో ఒకరి కళ్ళలోకి ఒకరు నవ్వుతో, పువ్వులు, నీళ్ళు, ప్రేమ వీక్షణాలు విసురుకుంటో.

తలవొంచుకుని పోతున్నాను నేను, తదేకదృష్టితో 'జవ్హార్‌లాల్, జవ్హార్‌లాల్ అని పఠనం చేసుకుంటో, నావంక నిదానంగా చూసి, ఇద్దరు యువతులు నన్ను గుర్తుపట్టి పిలిచారు. "ఎందుకు?" అన్నాను విసుగుగా.

"ఎక్కడికి అంత తొందరగా! ఎప్పుడో ఇక్కడికి రావలసినవాడివి ఇన్నేళ్ళు ఆలస్యంగా వొచ్చి పైగా."

"వొస్తాను. కాని ఇప్పుడు చాలా పనిమీద వెడుతున్నాను తొందర."

"వెర్రి వొదిలిపోలేదు? తొందరా? దేనికి?"

"జవ్హార్‌లాల్ మీద వ్యాసానికి విషయం కావాలి. వెతుకుతో వెడుతున్నాను."

"జవ్హార్‌లాల్! వ్యాసం! రాయడం, ఎందుకు? ఆయన ఎవరు ఇంతకీ, నీకింత ప్రాముఖ్యం కావడానికి!"

"ఆయనా? మా దేశానికి స్వతంత్రం కోసం పోరాడి సంపాయించిన నాయకుడు, మహావీరుడు."

బిగ్గరగా నవ్వారు. "జవ్హార్‌లాల్ జవ్హార్‌లాల్" అని వెక్కిరింపుగా ఒకరినించి ఒకరు అందుకుని నవ్వారు. మబ్బుల్లోంచి, పొదల్లోంచి, నదీతీరాలనించి.

"ఎందుకట్లా నవ్వుతారు? ఆయన భారతదేశానికి ప్రధానమంత్రి."

"ప్రధానమంత్రా? అయితే ఇంకనేం స్వతంత్రం?"

"ఏం?" అని కోపంగా.

"ప్రధానమంత్రి అవసరమైతే ఇంకేం స్వతంత్రం? ఇట్లా వుంటుందా మీ దేశంలో స్వతంత్రం?"

"ఇట్లా వుండడమేమిటి?"

"వుండదా? అయితే ఇంకనేం? ఇన్నేళ్ళు శృంగార కథలు రాసి, ఈ లోకం కలలు కన్న నీకు ఆ జవ్హార్‌లాల్‌తో, అట్లాంటి స్వతంత్రంతో నీకేం పని? ఇట్లా రా."

"స్వతంత్రమంటే కృషా? ఏం చేస్తో వుంటారేమిటి?"

"స్వతంత్రం వొచ్చింతరవాత ఆహారోత్పత్తి చేస్తున్నాం, పరిశ్రమాలయాలు స్థాపిస్తున్నాం, దేశవిభజనలు చేశాం, యుద్ధాజ్ఞలలో విజయాలు సంపాయించాం. విమానకేంద్రాలు నిర్మించుకున్నాం."

"విమానాలా! మీరు ఎగరలేరు! యుద్ధాలా? చంపుకోడమా! ఎందుకు స్వతంత్రం ఎప్పుడూ పనా? పండించడమా, విభజించడమా? ఎందుకూ కొరగాని ఆ స్వతంత్రం సంపాయించిన ఆ నాయకుడి మీద కష్టపడి ఆ వ్యాసం రాయకపోతేనేంలే. రా. ఆడుకో. మధుపానం చెయ్యి."

"మధుపానం మాన్పించాము."

"స్వతంత్రం హ.హ.హ."

అని పకపక నవ్వారు.

మధువులో, ప్రణయంలో సోలుతో తూలుతో క్రీడించే యీ దివ్యసుఖాసక్తులకి ఎట్లా అర్థమవుతుంది స్వతంత్ర పిపాస! ఎంత దాస్యంలోంచి నీచ భారంనించి, తల యెత్తలేని సిగ్గులోనించి నూతన ధైర్య విశ్వాసాలలోకి కళ్ళు తెరవ గలిగామో! స్వతంత్రాదర్శం ఇంకా వింత ఎండమావై ఊరించినా, తమ రక్తాన్ని ధారపోసిన ధీరుల త్యాగం మూలానైనా అమూల్యమయిందన్న సంగతి వీళ్ళకి ఎట్లా అర్థం చెయ్యగలను?

ఇంతసేపు నన్ను ముఖ్యంగా ప్రశ్నించిన విలాసిని నా చేతినిపట్టుకుని తనతో తీసుకుపోతోవుంటే నిరాకరించలేకపోయినాను. నన్ను చూడడానికి చాలామంది గుమికూడారు. ఆమె నా మీదికి ఒరిగి ఊపిరిని ఆపే ఆ అందాన్ని చుట్టూ చూపి "ఇంత సుందరంగా వుంటుందా మీ స్వతంత్రం? అని అడిగింది."

"ఈ ఆనందాన్ని మీ జవ్హార్‌లాల్ ఎరుగునా?" అంది ఇంకో ఆమె.

ఆమె చేతుల్ని విదిలించుకుని చప్పున పైకి లేచి కూచున్నాను.

"జవ్హార్‌లాల్ గొప్ప ప్రేమికుడు, విరహి, వియోగి, అతని అర్ధాంగి సమాధిని దర్శించడానికి వెడుతున్నాడు." అన్నాను గర్వంగా.

"జవ్హార్‌లాల్, ప్రేమికుడు, విరహి" అని జాలిగా గర్వంగా, భక్తిగా పాడారు. "ప్రేమికుడు జవ్హార్‌లాల్ తెలుసు మాకు" అన్నారు. మెల్లిగా నృత్యాలు ఆగిపోయినాయి. సంగీతాలు తగ్గిపోయినాయి. కిన్నెరలూ గంధర్వులూ మేఘాల్లో కరిగిపోయి మాయమైనారు. అంతా చలనం లేక స్తంభితమయింది. చప్పున చీకటయింది. కటిక చీకటి. రాయివంటి నిశ్శబ్దం నేను వొంటరిగా వున్నాను. మెల్లిగా చిన్న సంగీతం. ఒక్క రవ్వ గాలి. పక్షి రెక్కల చప్పుడు. తూర్పునుంచి కాంతి. ఎవరూ లేరు అక్కడ, నేనూ లేను. అదే దృశ్యం. మెత్తని మసకైన ఉషాకాంతిలో, అన్నీ సమాధులు. ఒక సమాధి మెట్లదగ్గర నిశ్చలమైన స్వరూపం. ఇంగ్లీషు బట్టలు, టోపీమాత్రం మినహా మధ్య బట్టతల, చుట్టూ తెల్లని జుట్టు. చీకట్లో గుర్తురాడు. వొంచిన తల, మెల్లిగా కళ్ళనించి చంపలకి కన్నీళ్ళు.

"కమలా, కమలా! అన్న రహస్య రవం అతని హృదయంలోంచి.

కారు చప్పుడు దూరంగా, ఎవరూ వొచ్చి తనని డిస్టర్బు చెయ్యడం ఇష్టం లేక, ఆయన లేచి తప్పుకుపోవాలని చూస్తున్నాడు. కారుదిగి ఆయనకెదురుగా ఒకామె వొచ్చింది. పెద్ద శరీరం, షిఫానీ చీరె, చేతిలో సంచి, ఎత్తుమడమల జోళ్ళు తొరతొరగా వొచ్చి అతన్ని చూసి ఆగింది.

ఆమె॥ ఇంకా ఎవరూ రాలేదా?

(ఆయన మారుపలకలేదు. తన దర్జానీ ఐశ్వర్యాన్నీ చూసి ఆయన రియాక్టు కాలేదని ఆమెకి కోపం వచ్చింది.)

ఆమె॥ మిమ్మల్నే! ఏం? వినపట్టంలేదా?

అతను॥ (ఎంత విసుగైనా, స్త్రీల మీది మర్యాదనించి తప్పించుకోలేక) ఏమిటి?

ఆమె॥ ఇంకా ఎవరూ రాలేదా?

అతను॥ ఇక్కడికి ఎందుకు వొస్తారు? తమ ఆప్తుల్ని పోగొట్టుకున్న నావంటి నిర్భాగ్యులు తప్ప!

ఆమె॥ చాలా హడావిడిగా, (తమ ప్రాముఖ్యతని ప్రగల్భం చేసుకుంటో)

గాంధీ పేరు చెప్పి, దేశానికని, స్వతంత్రమని, నిరాడంబర జీవితమని, త్యాగమని, ఆమెని క్షోభపెట్టి వొంటరిని చేసి, జైళ్లకు పంపి, ఆరోగ్యం నాశనం చేసి, ఆమె కాలాన్నే వ్యథతో నింపి, చంపుకున్న దౌర్భాగ్యుడు జహ్వార్! ఎందుకు ఈనాడు ఆమె సమాధిని దర్శిస్తేనేం, పూజలూ, ఉత్సవాలూ చేస్తేనేం? ఎందుకు? ఎవరికి? అతను వుత్తమోసం. అంతా నటన.

ఆమె॥ ఆమె మహా పతివ్రత, తనంతట తానే తన యవ్వనాన్ని, సౌఖ్యాన్ని, ప్రాణాన్నే అర్పించుకుంది దేశస్వాతంత్రం కోసం.

ఆయన॥ ఆమె సరేలెండి. ఆ త్యాగాన్ని ఆయన ఎట్లా అంగీకరించగలిగాడు? దేశభక్తినే, తన ఘనతనే, స్వాతంత్ర సమర దీక్షనే చూసుకున్నాడు కాని ఎండ కన్నెరగని ఆ కుసుమ కోమల శరీర, ఆమె ఎన్ని చీలికలౌతోందో గమనించాడా? వుత్త స్వార్థపరుడు.

ఆమె॥ చాలా బుద్ధితక్కువగా మాట్లాడుతున్నావు. సీతని అడవికి పంపించిన శ్రీరాముడి ప్రేమకి లోపం లేకపోయినా అతని జీవితానికి వెలుగు అస్తమించలేదా? జహ్వార్ ప్రధానమంత్రి ఐతేనేం, ప్రపంచానికి ఏకైక నాయకుడైతేనేం తన ఘనతని వైభవాన్ని చూసి సంతోషించే నెచ్చెలి లేని జీవితం ఏం ప్రయోజనం? వుత్త బూడిద.

ఆయన॥ (బిగ్గరగా) ఏం రక్షణ! విప్లవాలు, యుద్ధాలు, క్షామాలు, దేశంలో అసంతృప్తి. అతని మీద గంపెడాశపెట్టుకున్న బీదప్రజలు 'మాకేం. చేశావు? నువ్వు! అని నిలేసి అడుగుతున్నారు. జవాబు చెపుతాడు మీ జహ్వార్!

ఆమె॥ ఓహో! అనుకుంటోనే వున్నాను. సోషలిస్టు ముఠాలో వాడివని నువ్వు.

(అంటో భయపడి గడియారం చూసుకుంటో)

ఏమిటి? ఏడుదాటింది! ఎవరూ లేరేం?

ఆయన॥ నేను చెప్పలేదూ ఎవరూ రారని!

మళ్ళీ కులాసాగా నవ్వుతున్నాడు)

ఆమె॥ (భయంతో) షాఫర్, షాఫర్!

(అంటో వెనక్కి తిరిగింది. వెళ్ళిపోవడానికి ఆమెకి ఎదురుగా ఓ గుంపు వొస్తోంది. పూలహారాలు, కెమారాలు పట్టుకుని)

ఆమె॥ ఇక్కడో సోషలిస్టు చేరాడు. పట్టుకోండి పట్టుకోండి.

వాళ్ళు, ఏడి! ఏడి!

ఆమె॥ జవహర్‌లాల్ వొచ్చారా? రాడని ఎంత వాదించి మోసపుచ్చాడు నన్ను."

ఒకడు॥ ఎవరు?

ఆమె॥ ఆ సోషలిస్టే. వాడి మాటలు విని ఈ ఉత్సవం చూడకుండా వెళ్ళిపోయేదాన్నే. ఏరీ జవహర్‌లాల్! ఆ తెల్లటోపీ, వేస్టుకోటూ వేసుకున్న ఆయనేనా?

ఒకడు॥ "కాదు ఇప్పుడు ప్రతివారూ ఆ వేషమే."

ఆమె॥ ఐతే జవహర్‌లాల్ ఏరీ?

ఒకడు॥ ఆయన మాముందే తెల్లారకట్ట మూడింటికే లేచి వొంటరిగా వొచ్చారుట. ఆయనకోసమే వెతుకుతున్నాము.

ఆమె॥ ఎవరూ లేరే ఇక్కడ జహ్వార్‌లాల్‌ని తిడుతున్న ఆ సోషలిస్టు తప్ప!

గుంపు॥ ఏడి ఆ సోషలిస్టు?

(అప్పుడు సమాధి పక్కనించి ముందుకి వొచ్చి నుంచున్నాడు. ('ఆయన')

ఆయన॥ నేనే ఆ సోషలిస్టుని.

(ఆయన్ని చూచి అందరూ జహ్వార్‌లాల్, జహ్వార్‌లాల్ అంటో వెళ్ళి పూలమాలలు వేస్తున్నారు ఆయనకి?)

(ఆంధ్రజ్యోతి మాసపత్రిక ఆగస్టు 1949)

(చలం అసంకలిత రచనగా సేకరించిన చలసాని ప్రసాద్‌గారికి కృతజ్ఞతలు)

◆ ◆ ◆